TELTEL12349

# మన సాక్షి

గొంతుక

తెలుగు దినపత్రిక

ఎడిటర్: గుండ రాజు

చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ

విలేకరులకు ఇదే మా ఆహ్వానం

అనతి కాలంలోనే విశేష ఆదరణ పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న మన సాక్షి తెలుగు దినపత్రిక అతి త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు చేరువయ్యేందుకు సుముహూర్తం సిద్ధమయ్యింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనుభవం, ఆసక్తి కలిగిన విలేకరులకు ఇదే మా ఆహ్వానం.

చీఫ్ ఎడిటర్ : చింతల మధుకృష్ణ

7095686969

ఎడిటర్ : గుండ రాజు

96763 33440



తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 1 సంచిక : 82 12- 6 - 2024 బుధవారం పేజీలు : 6 వెల.4/-

# ప్రజాస్వామ్య స్ఫూర్తిని పాటిద్దాం

## కక్షలకు ఇది సమయం కాదు



- ప్రతీకారేచ్ఛతో రగిలిపోవద్దు
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యేలు వివరించాలి
- జనసేన శాసన సభపక్ష నేతగా పవన్ కల్యాణ్
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు

ప్రజలు అందించిన ఈ ఘన విజయం కక్ష సాధింపు రాజకీయాల కోసం కాదు. పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికి అంతకంటే కాదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు మనల్ని మనస్ఫూర్తిగా నమ్మి అఖండ విజయాన్ని అందించారంటే వారికి అత్యుత్తమ పాలన ఇవ్వాలని చెప్పడమే అన్నారు. నేను ఎప్పుడూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని తప్పి ప్రవర్తించలేదన్నారు. గత ప్రభుత్వానికి ఇది అర్థం కాలేదని, ఇప్పుడు అధికారంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించే బాధ్యతను తీసుకుంటామని పవన్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన పార్టీ శాసనసభ పక్ష మొదటి సమావేశంలో జనసేన శాసనసభ పక్ష నాయకుడుగా పవన్ కళ్యాణ్‌ని ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట పవన్ ను పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించగా... సభ్యులంతా ఏకగ్రీవంగా బలపరిచారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "జనసేన పార్టీ విలువలను, స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా పని చేయాలన్నారు. పగలు, ప్రతీకారాలకు సమయం కాదని, దీనిని శ్రేణులకు అర్థమయ్యేలా నాయకులు తెలియజెప్పాలని కోరారు.

# ఆ మూడూ.. గ్యారెంటీ!

## ఇకపై చంద్రబాబు మార్క్



- మెగా డీఎస్సీపై ఫస్ట్ సిగ్నేచర్
- భూహక్కు చట్టం రద్దుపై రెండో సంతకం
- పెన్షన్ల పెంపు దలపై మూడో సంతకం
- ఈ సంతకాల పైనే సర్వత్రా ఉత్కంఠ

ఏపీలో నాలుగోసారి ముఖ్యమంత్రి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవం బుధవారం గన్నవరంలో అంగరంగ వైభవంగా జరగబోతోంది. ఏపీ రాజకీయాల్లోనే ఈ ప్రమాణ స్వీకారం చరిత్ర సృష్టించనుంది. ఎందుకంటే... ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మూడు కీలక హామీలను ఇచ్చారు. ఈ హామీలకే జనం ఆకర్షితులయ్యారు. ఘన విజయం అందించారు. రూ.2.70 కోట్ల నవరత్నాలను తృణపాయంగా గులకరాళ్లుగా భావించారు. కానీ, ఇంతకంటే గొప్ప ప్రయోజనానికే తలవంచారు. ఇందులో ఎలాంటి డౌటనుమానం అక్కరలేదని ఎనలిస్టులు చెబుతున్నారు. ఇంతకీ ఆ వరాల మూటలో కీలక ఫైళ్లపైనే అందరి దృష్టి మళ్లింది. ఇంతకీ చంద్రబాబు ఆ మూడు హామీలను నిలబెట్టుకుంటారా? అంటే.. ఔను ఆయన సంతకాలు చేయటం ఖాయమని టీడీపీ నేతలు గర్వంగా చెబుతున్నారు. విజయవాడ



# రామోజీ కుటుంబసభ్యులకు సీఎం పరామర్శ

వివరాలు 2 లో..

# ప్రతిదానికి ముఖ్యమంత్రిదే బాధ్యతనా?

- ప్రభుత్వ శాఖల్లో జరిగే అన్ని చర్యలను సీఎంకు ఆపాదించలేం
- ఓయూ హాస్టళ్ల బంద్ నోటీస్‌పై వివాదంలో హైకోర్టు వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 11

'ప్రభుత్వంలో జరిగే ప్రతి పనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలా? రేపు ఓ బిచ్చగాడు వచ్చి భిక్షాటనే నా ఆదాయం. కానీ, రోడ్డును ఆక్రమించానని ఖాళీ చేయమంటున్నారు. దీనికి ముఖ్యమంత్రే బాధ్యులు అంటే ఏం చేస్తారు?' అని హైకోర్టు ప్రశ్నించింది. వేసవి సెలవుల సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల మూసివేత నోటీసపై నెలకొన్న వివాదంలో సీఎం రేవంత్‌రెడ్డి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ పలువురు ఓయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. అడ్మిషన్ దశలోనే డిస్మిస్ చేస్తూ ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ శాఖల్లో జరిగే ప్రతి చర్యను ముఖ్యమంత్రికే ఆపాదించలేమని స్పష్టం చేసింది. "ఒకే వ్యవహారానికి సంబంధించి కౌంటర్ కేసులు పెట్టడం కుదరదు. హాస్టళ్ల మూసివేత వ్యవహారంలో ఫేక్ నోటీసుపై ఇప్పటికే కేసు నమోదైంది.

అది విచారణలో ఉండగా ఇంకో కేసు అవసరం లేదు" అని పేర్కొంది. ఈ మేరకు రేవంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న పిటిషన్‌ను కొట్టేసింది.

# మరో 3 రోజుల పాటు భారీ వర్షాలు..!



హైదరాబాద్ : రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. ఈనెల 5న మహబూబ్‌నగర్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన రుతుపవనాలు, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. దీని ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొంది. మంగళవారం ఉత్తర అరేబియా సముద్రం, మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాల్లో రుతుపవనాలు విస్తరించాయి. నైరుతి రుతుపవనాల విస్తరణ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధ, గురువారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని సూచించింది.ఇక గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మలాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు సూచించింది. మూడు రోజులపాటు ఆయా ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయ ణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ మంగళవారం వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా దిగువకు చేరాయి.

# రామోజీ కుటుంబసభ్యులకు సీఎం పరామర్శ

**హైదరాబాద్, జూన్ 11**
ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబసభ్యులను మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. రామోజీరావు మరణించిన సమయంలో ఢిల్లీలో ఉన్న సీఎం సీడబ్ల్యూసీ, పార్టీ ఇతర సమావేశాల్లో పాల్గొనాల్సి ఉండడంతో పార్థివ దేహాన్ని చూసేందుకుగానీ, అంత్యక్రియలకు గానీ హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీరావు నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. రామోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీఎంతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, ఇటీవల ఖమ్మం పట్టభద్రులు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన తీన్మార్ మల్లన్న మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం నివాసంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వారిని అభినందించి శాలువాలతో సత్కరించారు.

# అంతా.. హై కమాండ్

## ఏపీ బీజేపీపక్ష నేత ఎవరు?



- అధిష్ఠానానికి వదిలేసిన రాష్ట్ర పార్టీ
- విజయవాడలో బీజేపీ ఎమ్మెల్యేల భేటీ
- శాసనసభాపక్ష నేతపై చర్చ
- ఢిల్లీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్న పురందేశ్వరి

ఏపీ బీజేపీ శాసన సభ పక్ష నేత ఎంపికను ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించనుంది. ఈ మేరకు మంగళవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పరందేశ్వరి మ్మెల్యేలతో శాసనసభా పక్ష నేత ఎంపికపై చర్చించారు. అధిష్ఠానం ప్రకటనకు అందరూ కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ప్రజలు కూటమిపై విశ్వాసంతో మంచి విజయం అందించారన్నారు. సీఎం ప్రమాణ స్వీకార సభకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర పార్టీ తరపున తామంతా సభకు హాజరవుతున్నామని తెలిపారు.

# మెగాస్టార్ వస్తున్నాడు

- చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి పిలుపు

ఏపీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి 164 ఎమ్మెల్యే సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. బుధవారం ఉదయం 11 గంటల 27 నిమిషాలకు చంద్రబాబు ప్రమాణస్వీకారం జరగనుంది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సినీ, రాజకీయ, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరవనున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చిరంజీవికి ఆహ్వానం అందింది. స్టేట్ గెస్ట్ గా చిరంజీవికి స్వయంగా చంద్రబాబు ఈ ఆహ్వానం పంపారు. అయన ఆహ్వానం మేరకు చిరంజీవి మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు విజయవాడకు కుటుంబ సభ్యులతో కలసి వెళ్లనున్నారు.

# 13 నుంచి విద్యా కానుక పంపిణీ

- సర్వం సిద్ధం చేసిన ఏపీ విద్యా శాఖ

ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. యధావిధిగా విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని అలాగే కొనసాగించేందుకు నిర్ణయం తీసుకుంది.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుకను... జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన తరహాలోనే ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది కొత్త ప్రభుత్వం.ప్రభుత్వం మారినందున విద్య కానుకను ఏం చేస్తారనే సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది చంద్రబాబు ప్రభుత్వం. బడి గంట మోగిన తొలి రోజునే విద్యార్థులకు విద్యా కానుకలు ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు.. ఈనెల 13వ తేదీన బడులు తెచ్చుకునే రోజు నుంచి పంపిణీ మొదలు పెట్టనుంది. 2024 సంవత్సరం నుంచి 2025 విద్యా సంవత్సరంలో పంపిణీ కిట్లను ఇప్పటికే సిద్ధం చేసింది ప్రభుత్వం.

# బతుకుతామని అనుకోలే!

## సీట్ల కింద దాక్కున్నాం

- ఇప్పటికీ నమ్మకం కలగడం లేదు
- టెర్రరిస్టుల దాడి ఘటనలో గాయపడ్డ కుటుంబం
- బతికి బయటపడిన మృత్యుంజయులు
- అరగంట పాటు క్షణక్షణం భీతిల్లిన ప్రయాణికులు
- ఇద్దరు చిన్నారులు క్షేమమే.. దంపతులకు తీవ్ర గాయాలు
- వైష్ణో దేవీ దర్శనానికి వెళ్తుండగా టెర్రరిస్టుల అటాక్
- కశ్మీర్ లోయలో ప్రమాదానికి గురైన బస్సు



కాశ్మీర్ లోయ.. భువిపై అందచందాల సీమ. ఆకాశాన్నంటే పచ్చని తరులు. చందమామను ముద్దాడే గిరులు.. భూమాత చుంభనం కోసం నేలకొరిగిన హరివిల్లు లెక్కన రంగురంగుల పూలవనాలతో మదిని మైమరపించే ఈ లోయ.. ప్రస్తుతం రక్తధారల సెలయేళ్లకు అలవాలమైంది. అక్కడికి అడుగుపెట్టినవారి గుండెల్లో ఆ వ్యథ.. భయం వర్ణనాతీతం.. కాశ్మీర్‌లో ఆదివారం ఓ బస్సుపై ఉగ్రమూకల దాడి ఘటనలో తుపాకీ తూటాలకు పదిమంది పిట్టల్లా రాలిపోయారు. మిగిలిన ప్రయాణికులు ప్రాణాలు గుపెట్లో పెట్టుకుని క్షణ క్షణం నరకయాతన అనుభవించారు. కళ్లముందే బస్సు లోయలోకి దూసుకుపోయింది. ఇక చచ్చిపోయామని కళ్లు మూసి తెరచే లోపు.. 33 మంది గాయాలతో చావుకేకలు పెడుతుంటే.. ఆ బుల్లెట్ల శబ్ధంలో కనీసం వినపడని స్థితి అది. అసలు బతుకుతారో లేదో తెలీదు. ప్రాణం ఉన్నంత వరకూ తమను తామే కాదు.. తమ బంధువులనూ కాపాడుకోవాలని తపించిపోయిన వైనం ఇది.

### సీన్ కట్ చేస్తే..

ఆదివారం ఉదయం శివఖోరి నుంచి కాట్రాకు 41 మందితో బస్సు బయలు దేరింది. మరో గంటలో వైష్ణోదేవీ ఆలయానికి చేరుతుంది. లోయలో కశ్మీరం అందచందాలను చూస్తూ ప్రయాణికులు పరవశించిపోతున్నారు. బస్సు రియాసీ ప్రాంతానికి చేరుకుంది. అంతే అనుకోకుండా బుల్లెట్ల వాన ఆరంభమైంది. బస్సులో జనం బిక్కచచ్చిపోయారు. బస్సును ఆపాలని గొడవ మొదలెట్టారు. బస్సు ఆపితే అందరం చచ్చిపోతాం.. సీట్ల కిందకు దాక్కోవాలని డ్రైవరు వార్నింగ్ ఇచ్చాడు. ఇంతలో బుల్లెట్టు తగిలింది. డ్రైవరు కంగుతిన్నాడు. బస్సు అదుపు తప్పింది. లోయలోకి జారిపోయింది. అంతే చావు కేకలు మార్మోగాయి. పదిమంది నోట మాట లేదు. శరీరాల్లో బుల్లెట్లు దిగి రక్తం చిందింది. మిగిలిన ప్రయాణికులూ..గాయపడినోళ్లు గావుకేకలు పెడుతుంటే.. మిగిలినోళ్లు క్షణ క్షణం అల్లాడిపోయారు. దాదాపు 25 నిముషాలపాటు సాగిన ఈ బుల్లెట్ల వర్షం ఆగిపోయింది. ఎవరు చచ్చిపోయారు? ఎవరు గాయపడ్డారు? ఎందరు బతికారో తెలియదు. కానీ, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగ్రాత్రులను ఆసుపత్రికి తరలించారు.

### అర గంట జీవన పోరాటం

ఈ రాక్షస ఉగ్రదాడిలో బతికి బట్ట కట్టిన మృత్యుంజయుల్లో ఢిల్లీకి చెందిన ఓ కుటుంబం నరకయాతన వర్ణనాతీతం. ఢిల్లీకి భవానీ శంకర్ ఆ బస్సులోనే ప్రయాణించారు. తమ పెళ్లిరోజు సందర్భంగా తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి వైష్ణవోదేవి ఆలయ దర్శనం కోసం భవానీ శంకర్ బయలుదేరారు. రియాసి జిల్లాలోని శివ కోహరి ఆలయానికి వెళ్తున్న సమయంలో బస్సుపై కాల్పుల మోత మోగింది.టెర్రరిస్టుల కాల్పులతో బుల్లెట్లు దూసుకొస్తున్న ఆ క్షణంలో.. తాము ముందుకు వంగిపోయామని, తన ఇద్దరు పిల్లల్ని బస్సు సీటు కింద దాచిపెట్టామని శంకర్ తెలిపారు. దాదాపు 20 నుంచి 25 నిమిషాల పాటు బుల్లెట్ల వర్షం కొనసాగిందని, ఆ భయానక పరిస్థితుల్ని ఎన్నటికీ మరిచిపోలేనని చెప్పారు. భవానీ శంకర్‌తో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. వాళ్లు జమ్మూకశ్మీర్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కూతురు దీక్షా రాఘవ్, మూడేళ్ల కుమారుడు రాఘవ్‌తో పాటు భార్య రాధాదేవి ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు.

# సీఎం రేవంత్ ఇంటి వద్ద గురుకుల టీచర్ల నిరసన

- తమ సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్
- మోకాళ్లపై నిలబడి ఆందోళన
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను అడ్డుకున్న టీచర్లు
- గాంధీ భవన్ వద్ద ఏఈఈలు ధర్నా




జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు మంగళవారం గురుకుల టీచర్ అభ్యర్థులు నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను గురుకుల టీచర్ అభ్యర్థులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ చేతులెత్తి దండం పెడుతూ వేడుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అలాగే జీతాలు రావట్లేదని సీఎం ఇంటి వద్ద నర్సింగ్ స్టాఫ్ నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

### గాంధీ భవన్ ముందు కూడా..

గాంధీభవన్ దగ్గర ఏఈఈ అభ్యర్థులు నిరసన చేపట్టారు. డాక్యుమెంటేషన్ జరిగి నెలలు గడుస్తున్నా తమకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదంటూ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అభ్యర్థులు వాపోయారు. మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని అభ్యర్థుల ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే ఇవాళ గాంధీ భవన్ దగ్గర మోకాల్ల మీద కూర్చొని ఏఈఈ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. మార్చ్ లో 1:2 రేషియోలో అభ్యర్థులను కమిషన్ సెలెక్ట్ చేసింది. డాక్యుమెంటేషన్ జరిగి మూడు నెలలు గడిచినా కమిషన్ అపాయింట్మెంట్ లేటర్లు ఇవ్వలేదని అభ్యర్థులు వాపోయారు.



# రేపు చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ ఆంక్షలు
- విమాన సర్వీస్‌లు యథాతథం
- ముందుగానే ఎయిర్ పోర్ట్ కు రావాలని ప్రయాణికులకు అధికారుల వినతి

ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బుధవారం నాడు విమాన ప్రయాణికులు ఉదయం 9.30 గంటల్లోపే చేరుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత రెడ్డి సూచించారు. ప్రయాణికుల విమానాలేవీ రద్దు చేయలేదని.. అన్నీ యథాతథంగా నడుస్తాయని తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, షిర్డీ వెళ్లే విమానాలు యధావిధిగా బయల్దేరతాయని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విమానాశ్రయ పరిసరాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

# ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు

- హోటల్స్ యాజమాన్యాలకు మంత్రి దామోదర్ వార్నింగ్
- నేడు హోటల్స్ అసోసియేషన్స్ ప్రతినిధులతో భేటి

ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. హోటల్స్ అసోసియేషన్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. హైదరాబాద్ బిర్యానికి అంత ర్జాతీయంగా గుర్తింపు ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్ ను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతున్నామన్నారు. హోటల్ ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి వర్క్ షాప్ ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై సానుకూల స్పందించారు. కాగా, భాగ్యనగరంలో పెద్ద పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు గత కొన్ని రోజులుగా హైదరాబాద్ లోని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ ఫ్రిజ్ లలో నిల్వ ఉంచి, కాలం చెల్లిన మాంసం, వస్తువులను వంటకు వినియోగిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఈ నేపథ్యంలోనే మంత్రి దామోదర్ రాజనర్సింహ హోటల్స్ ప్రతినిధులతో సమావేశమై పలు సూచనలు చేశారు..

# ఏపీకి కేంద్రం తొలి బోణీ

## రూ.5 వేల కోట్లు రిలీజ్

:హ్యాట్రిక్ ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారంతరువాత.. ఇటు ఏపీలో చంద్రబాబు నాలుగో సారి సీఎంగా ప్రమాణం చేయనున్న వేళ..కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఖాతాలో తొలిబోణి చేసింది. చేతిలో చిల్లిగవ్వలేదు.. అన్నీ అప్పులే అని ఏపీ ప్రభుత్వం ఏకరవు పెడుతున్న తరుణంలో తన పన్నుల్లో వాటాగా కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు విడుదల చేసింది. జూన్ నెలలో ట్యాక్స్ డెవల్యూషన్‌లో భాగంగా కేంద్రం ఏపీకి రూ. 5వేల కోట్లు రిలీజ్ చేసింది. మరో ఇన్‌స్టాల్‌మెంట్‌ను కూడా కేంద్రం ఈ మొత్తాన్ని జమ చేసింది.. రాష్ట్రంలో నిలిచిపోయిన అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి, మూల ధన వ్యయాల కోసం ఈ నిధులు ఉపయోగపడతాయంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా మిగిలిన రాష్ట్రాలన్నింటికీ కలిపి రూ.1,39,750 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202425) మధ్యంతర బడ్జెట్ లో రాష్ట్రాలకు పన్నుల రూపంలో చెల్లించాల్సిన మొత్తం 12,19,783 కోట్లు కాగా.. అందులో భాగంగా ఈ నిధులు విడుదల చేశారు. ఇందులో ఏపీ వాటాగా రూ.5,655.72 కోట్లు విడుదల చేశారు. తెలంగాణకు రూ.2,500 కోట్లు, అరుణాచల్ ప్రదేశ్‌కు రూ.2,455.44, అసోంకు రూ. 4,371.38, బీహార్ రూ. 14,056.12 కోట్లు, ఛత్తీస్‌గఢ్ కు రూ. 4,761.30 కోట్లు, గోవాకు రూ.539.42 కోట్లు, గుజరాత్ కు రూ.4,860.56 కోట్లు, హర్యానా కు రూ.1,527.48 కోట్లు, హిమాచల్ ప్రదేశ్ రూ. 1,159.92 కోట్లు విడుదల అయ్యాయి.

# 'నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి'

### ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



**మన సాక్షి గొంతుక ప్రతినిధి/హైదరాబాద్:**
నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయనే అనుమానం ఉన్నదని మళ్లీ ఎగ్జామ్ నిర్వహించాలని ఆర్టీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు.హైదరాబాద్ లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ నెల 14వ తేదీన రావాల్సిన నీట్ ఈ ఫలితాలను ఎన్నికల రిజల్ట్స్ రోజున హడావిడిగా విడుదల చేశారని ఆరోపించారు.నీట్ లో ఆల్ ఇండియా స్థాయిలో 67 మంది ఫస్ట్ ర్యాంక్ సాధించారని,వారిలో మొత్తం 720 గాను 719,718 మార్కులు సాధించారని,నీట్ చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఎప్పుడు రాలేదన్నారు.అంతేగాకుండా ఒకే సెంటర్ నుంచి 8 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని,ఎగ్జామ్ నిర్వహణలో జరిగిన లోపాలకు ఇదే నిదర్శనమన్నారు. టెక్నికల్ సమస్యల వలన పరీక్షను లేట్ గా నిర్వహించి,నిర్ణీత సమయంలోనే పరీక్ష ముగించారని,దీంతో సమయం కోల్పోయిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. హడావిడిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధిత విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతామని ప్రకటించారని,దీనివలన మెరిట్ స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోయారన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పై సీబీఐ విచారణ జరిపించాలని లేకుంటే ఆర్టీఐ ఇండియా నేతృత్వంలో ఆందోళనలు చేపడుతామని చంటి ముదిరాజ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి,హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజు,నమిండ్ల హరీష్,సాదబోయిన రాజు,అక్కెల్లి పవన్ కళ్యాణ్,కార్తీక్,ప్రవీణ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# గృహ జ్యోతి పథకం వెంటనే అమలు చేయాలి

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్

**మన సాక్షి గొంతుక /జూన్ 11/రంగా రెడ్డి జిల్లా బ్యూరో**
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాజేంద్రనగర్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియడంతో 6 గ్యారంటీలను కొన్ని అమలు చేయడం జరిగింది ప్రధానమైనటువంటి హామీలను అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే గృహజ్యోతి పథకం అమలు చేస్తామని చెప్పడం జరిగింది. గృహ జ్యోతి పథకం క్రింద వినియోగదారులకు 200 యూనిట్లు వరకు వచ్చే బిల్లులు జీరో క్రింద బిల్లులు అమలు చేయాలి అన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నారు రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో మరియు గ్రేటర్ పరిధిలో వచ్చే అని డివిజన్లో కూడా అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధాప్య పింఛన్లు 4వేలు, మహిళలకు 2500/–లు , గ్యాస్ సిలిండర్ 500/–లకే, ఇంకా అనేకమైనటువంటి హామీలు ఇవ్వడం జరిగింది. ఇచ్చినటువంటి అన్ని హామీలను అమలు చేయాలన్నారు. అమలు చేయకుంటే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు,.నిరంజన్ గౌడ్, జి.సత్యం పాల్గొన్నారు.

# కీ.శే సాంబరాజు రవికి ఘన నివాళు లర్పించిన టిఆర్ఆర్ఎస్ జనగామ జిల్లా నాయకులు



**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**
తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ అధ్వర్యంలో మంగళవారం తెరరిస మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కీశే సాంబరాజు రవి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు.భౌతికంగా వారు లేకున్నా రజక జాతికి చేసిన సేవలు చిరస్మరణీయం అని వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక,రాష్ట్ర ఉపాధ్యక్షులు మిన్నలపురం జలేంధర్,రాష్ట్రసంయుక్త కార్యదర్శి ఏదునూరి వీరన్న,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీకొండ రాజు,జిల్లా సీనియర్ నాయకులు ఉల్లెంగుల రాములు,జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు,జిల్లా కార్యదర్శి ఉల్లెంగుల రాజు,జిల్లా సంయుక్త కార్యదర్శి ఉల్లెంగుల చంద్రశేఖర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడాల రాజు,జిల్లా ప్రచార కార్యదర్శి కొన్నె ఉపేందర్,జిల్లా ముఖ్య సలహాదారు మెంతన కిష్టయ్య,దర్శనాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### మా భూమి మాకు ఇప్పించండి

# పట్టా పాస్ బుక్కులు ఇవ్వండి



**మన సాక్షి గొంతుక/ బచ్చన్నపేట మండలం**
జనగామ జిల్లా ,బచ్చన్నపేట మండలం,చిన్నరాంచర్ల, గ్రామానికి చెందిన రామగల్ల (గందమల్ల) విమలమ్మ, సోమవారం రోజున పట్టా పాస్ బుక్ లకు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోగా మంగళవారం రోజున బచ్చన్నపేట మండల స్థానిక తహసిల్దార్ విశాలక్షి నీ కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 74 సంవత్సరాల నుండి, కాస్తు కలిగి ఉండి, చిన్నరాంచర్ల గ్రామ శివారులో 5–16 గుంటల భూమిని వదిలి మేము కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ కు వలస పోయి, అక్కడే జీవనోపాధి చేసుకుంటూ జీవించినాము. మా పట్టాదారు, భర్త రామగల్ల లక్ష్మయ్య, ఆగయ్య అనే వ్యక్తి 2006 సంవత్సరంలో మరణించినాడు. 5–16 గుంటల భూమి వేరే వ్యక్తుల పట్టా అయి ఉన్నందువల్ల దానిని పరిశీలించి మా భూమి మాకు ఇప్పించగలరని తహసిల్దార్ విశాలక్షి నీ కోరారు.

# బెస్ట్ అవైలబుల్ పథకము కింద లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక పూర్తి

### – షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీమతి కె.దయానంద రాణి

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**
మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయము నందు గల ప్రధాన సమావేశ మందిరములో బెస్ట్అవైలబుల్ పథకము క్రింద 1వ తరగతి మరియు 5వ తరగతి లో ప్రవేశం పొందే షెడ్యూల్డ్కులములకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రానిర్వహించడం జరిగినదని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీమతి కె.దయానంద రాణి ఒకప్రకటనలో తెలిపినారు.1వ తరగతిలో (34) మంది మరియు 5వ తరగతి లో (25) మంది విద్యార్థిని విద్యార్థులకు ఈ పథకము క్రింద ప్రవేశం కల్పించడం జరిగినదని ఆమె తెలిపారు.ఈసందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని,భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి అభివృద్ధిలోనికి రావాలని అకాంక్షించారు.ఈ కార్యక్రమలో జిల్లా విద్యా అధికారి రాము మరియు




సోషల్ వెల్ఫేర్రెసిడెన్షియల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎ.నర్సింహులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారుల పనులు నాణ్యతతో చేపట్టాలి

### స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**
రహదారుల పనులు నాణ్యతతో చేపట్టాలని స్టేషన్ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి తెలిపారు.మంగళవారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయ సమావేశ మందిరంలో స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, ఐటీడీఏ ఏటూరు నాగారం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల పనులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ విద్య ,వైద్యం కు సంబంధించిన పనులకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలన్నారు(సి.డి.ఎఫ్) నియోజకవర్గ అభివృద్ధి (ఎస్.డి.ఎఫ్) రాష్ట్ర అభివృద్ధి నిధులు (ఎం.ఓ.–ఎం.బి.) అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు, (ఈ.జీ.ఎస్.) ఉపాధి హామీ పథకం, (ఎన్.హెచ్.ఎం.) జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద పనులకు విడుదల చేసిన నిధులను సకాలంలో వినియోగించి పాఠశాలల్లో అదనపు వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు.అవసరమైతే అదనంగా నిధుల కొరకు కృషి చేస్తామన్నారు.ప్రజలకు ఉపయోగకరమైన ప్రాధాన్యత గల రహదారులను మాత్రమే చేపట్టాలన్నారు.ప్రస్తుతం చేపట్టిన పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు.పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 89 పనులకు గాను 29 మాత్రమే పెండింగ్లో ఉన్నాయని మిగతా పనులు త్వరితగతిన చేపట్టి సత్వరమే పూర్తి చేయాలన్నారు.అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 33 పనులు ఉండగా 9 మాత్రమే పూర్తయ్యాయని మిగిలిన పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. జాప్యం తగదన్నారు.95 –96 సంవత్సర కాలంలో చేపట్టిన రహదారులు నేటికీ నాణ్యతతో ఉన్నాయని 2000 సంవత్సరము తర్వాత




చేపట్టిన రహదారి పనులలో నాణ్యత లేకపోవడం పర్యవేక్షణ లోపంగా ప్రస్ఫుటమవుతున్నదన్నారు.రహదారి నిర్మాణ పనులలో అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.జనగామ,స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గాలలో బంజార భవన్ నిర్మాణాలకు నిధులు ఉన్నాయని వెంటనే నిర్మాణం కొరకు స్థలం మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు.స్టేషన్ఘన్పూర్ మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య కేంద్రాలు అదనంగా ఉన్నందున వాటిని అవసరమైన చోట ఏర్పాటు చేసి వైద్యాన్ని పేదలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గంగా ఉన్నందున డివిజన్ స్థాయిలో కార్యాలయాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పంచాయతీ రాజ్ శాఖ ఎస్.ఈ.కె రఘువీరారెడ్డి,ఐటీడీఏ ఏటూర్ నాగారం ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ డి.వీరభద్రం,పంచాయతీరాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్,డిఇ లు, ఏ.ఈ.లు పాల్గొన్నారు.

# సమన్వయంతో విధులను నిర్వర్తించాలి.!

### సర్వసభ సమావేశంలో పాల్గొన్న జడ్పిటిసి తాంద్ర విశాల వెల్లడి

**మన సాక్షి గొంతుక /షాద్ నగర్**
జిల్లా స్థాయి సర్వసభ సమావేశాలలో కేశంపేట్ మండల జడ్పిటిసి తాంద్ర విశాల పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మైనింగ్ లైసెన్స్ ఓనర్స్ రూల్స్ పాటించే విధంగా చూడాలని, మైనింగ్ పూర్తి అయిన ప్రదేశాల్లో తగు సేఫ్టీ పరికరాలు ఉండే విధంగా చూడాలని, ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ సమయపాలన వంటి అంశాలపై, అలాగే ఆర్టీసీ బస్సుల కొరత సమస్య పైన, ప్రభుత్వ పాఠశాలలు పునప్రారంభం అవుతున్న సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫాం, నాణ్యమైన భోజనం ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, అంగన్వాడి కేంద్రాల్లో వర్షాకాలం సందర్భంగా పరిశుభ్రత పాటించి పిల్లల ఆరోగ్యానికి సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.విద్యుత్ శాఖ సంబంధించి వర్షాకాలంలో తీసుకోవలసిన చర్యలు మరియు జాగ్రత్తల గురించి చర్యలు తీసుకోవాలని కోరారు.



# నిబంధనలకు అనుగుణంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలి

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా స్టేట్ ఎనిమల్ వెల్ఫేర్ బోర్డ్,సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రుయాల్టీ టు అనిమల్స్ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి జంతుబలులు జరగకుండా ఉండేందుకు డీసీపీ సీతారాం,ఏసీపీ అంకిత్ కుమార్ శంఖ్వార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వెటర్నరీ డిపార్ట్మెంట్ అధికారులు,ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలపై సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ - 48 ప్రకారం పశుజాతుల రక్షణ,వాటిని అభివృద్ధి చేయుట,జంతువుల వధించుట నిషేధమని అన్నారు.ఈ ఆర్టికల్ ప్రకారంగా ఆవులు,దూడలు,పాలిచ్చే పశువులు,పనిచేసే పశువులను వధించడం నిషేధించబడిందని పేర్కొన్నారు.దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1977 సంవత్సరంలో జంతు వధ నిషేధ చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.ఈ చట్టం 19-12-76 నుంచి అమల్లోకి వచ్చిందని వివరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జీవో ఎంఎస్ నంబర్ 45 లా (ఎఫ్) డిపార్ట్మెంట్ డేట్ 1.6.2016న దీనిని తెలంగాణ ప్రభుత్వం స్వీకరించి,అమల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు.ఈ చట్టం ముఖ్య ఉద్దేశం ఆవులను, ఆవుదూడలను (ఆడగాని,మగ గాని) అదే విధంగా బర్రెలను (ఆడ,మగ అయినా) వాటి దూడలను వధించడం నిషేధించబడినది.14 సంవత్సరముల పైబడిన పశువులు పాలకు గాని,పనికి గాని అలాగే సంతాన ఉత్పత్తికి కానీ ఉపయోగపడని పశువులను సంబంధిత అధికారుల అనుమతి తీసుకుని వధించుకోవచ్చు.అవి ఎద్దులు,గేదెలు దున్నపోతులు మాత్రమే.వీటికి సంబంధిత అధికారుల నుంచి ఫిట్ ఫర్ స్లాటర్ సర్టిఫికెట్ పొందిన తర్వాత మాత్రమే అనుమతించబడును.వీటిని ప్రత్యేకమైన ప్రదేశంలో స్థానిక




అధికారులు నిర్ణయించిన ప్రదేశంలో పూర్తి చేయాలి.చట్ట వ్యతిరేక స్లాటర్ చేయడం,వారికి సహాయం చేయడం,చట్ట వ్యతిరేక స్లాటర్ ఎంకరేజ్ చేయడం,చేయడానికి ప్రయత్నించడం,ఉదేశపూర్వకంగా చంపడం ఇవన్నీ శిక్షార్హమైన పనులు.వీటికి చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం నోటీసు చేయకుండానే అరెస్టు చేయడం జరుగుతుంది.పెనాల్టీగా రూ.వెయ్యి జరిమానా,అంతేకాకుండా మూడు నెలల కారాగార శిక్ష విధించబడుతుంది కొన్ని సందర్భాల్లో రెండూనూ విధించవచ్చు.దీనికి సంబంధించి పోలీస్,రోడ్ ట్రాన్స్పోర్ట్, మార్కెటింగ్,వెటర్నరీ,అర్బన్ అండ్ రూరల్,సంబంధిత ఇతర శాఖల అధికారులందరూ తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కన్వీనర్ డాక్టర్ ఎస్ఎల్ మనోహర్,డివిహెచ్ఓ డాక్టర్ వై.నరసయ్య,జిల్లాలోని పశు వైద్యులు,ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలను మరింతగా పెంచాలి
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

ఈ నెల 20న మొదటి దశ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం,తదితర అంశాలపై జిల్లా అధికారులతో టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరంలో రెండు సార్లు,ఆరు నెలలకోసారి ఈ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.ఈ అల్బెండజోల్ మాత్ర నులి పురుగుల సంక్రమణను నియంత్రించుటలో సహాయపడుతుందని,జిల్లాలోని అన్ని కళాశాలలు,పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో 1-19 ఏళ్ల వయసు గల పిల్లలందరికీ ఉచితంగా ఇవ్వబడుతుందని పేర్కొన్నారు.ప్రతి విద్యాసంస్థల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ కింద ఏఎన్ఎంలు,ఆశాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ నులి పురుగుల పట్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు,ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.అలాగే సరిపడా ఔషధ గుళికలు అందుబాటులో ఉండేలా సరిచూసుకోవాలన్నారు.ప్రతి కేంద్రంలో పీహెచ్సీ డాక్టర్,ఐసీడీఎస్ సూపర్వైజర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.పరిశుభ్రమైన తాగునీరు, %శ్రీ%గ్లాసులు, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు.చేతుల పరిశుభ్రతపై విద్యార్థులు, చిన్నారులకు పోస్టర్ ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,దీనిపై యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలని తెలిపారు.అదే విధంగా జిల్లాలో మొత్తం (16) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.పీహెచ్సీల్లో ఓపీ సేవలను మరింతగా పెంచాలని సూచించారు.అలాగే డాక్టర్లు, సిబ్బందికి తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానంలో అటెండెన్స్



నులి పురుగుల నివారణ అవగాహన పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్,అధికారులు

తీసుకోవాలని ఆదేశించారు.అదే విధంగా రోస్టర్ ప్రకారంగా డాక్టర్లు,సిబ్బంది తమ విధులు నిర్వహించాలని,లేదంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఎప్పటికప్పుడు టీ-హబ్ నమోదును పూర్తిచేయాలన్నారు.సీహెచ్సీలలో సిబ్బందికి సమావేశాలు ఏర్పాటు చేయాలని,క్షేత్రస్థాయిలో పీహెచ్సీలు ,సీహెచ్సీలను సందర్శించి,పర్యవేక్షించాలని ప్రోగ్రామింగ్ అధికారులు,డిప్యూటీ డీఎంహెచ్ఓలను ఆదేశించారు.పెండింగ్ లో ఉన్న ఆసుపత్రులు,ల్యాబ్ ల అక్రెడిటేషన్ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వాటి నివేదికలను వెంటనే సమర్పించాలని తెలిపారు.అనంతరం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ హరీష్ రాజ్,మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,డీఈఓ రాము,డీఐఈఓ ఆంజనేయరాజు, డీడబ్ల్యూఓ జయంతి,డీఐఓ డా.మహేందర్,డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.సుధీర్,ప్రోగ్రాం అధికారులు,డీఈఎంఓ ప్రభాకర్, సీహెచ్ఓ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జై తెలంగాణ నినాదమే తన గొంతుక....

## నల్లగొండ జైల్లో తెలంగాణ నినాదాలు మోగించిన వలిగొండ ఉద్యమకారుడు సంఘశెట్టి క్రిస్టఫర్

మన సాక్షి గొంతుక్/ వలిగొండ జూన్ 12



పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదాన్ని. నిజం చేస్తూ రాష్ట్ర పోరాటంలో ముందుండి పోరాడిన ఉద్యమ యోధుడు ఆనాడు సమైక్య పోలీసులను ఎదిరించి అనేకసార్లు లాటి చార్జీలు భాష్పవాయువు పోలీసుల లాఠీ దెబ్బలకు ఎదురు నిలిచి సవాలు చేస్తూ నల్లగొండ జిల్లా జైల్లో తెలంగాణ రాష్ట్రం కోసం 28 రోజులు జైలు జీవితం గడిపిన వలిగొండ ఉద్యమకారుడు ఉద్యమ యోధుడు సంఘశెట్టి క్రిస్టఫర్. చరిత్ర లోకి వెళితే ఆయన వలిగొండలో తెలంగాణ ఉద్యమ నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్ తో కలిసి తెలంగాణ నినాదాన్ని మండల వ్యాప్తంగా విస్తరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని. ఆనాటి సమైక్య పోలీసులకు చుక్కలు చూపించి నినాదాన్ని మోగించిన ఉద్యమ సాధకులు సంగిశెట్టి క్రిస్టఫర్ ఒకానొక దశలో ఆనాటి సమైక్య పాలకులు ఎట్టి పరిస్థితిలో క్రిస్టఫర్.లాంటి వ్యక్తులను. కట్టడి చేయకపోతే ఉద్యమం ఆగదంటూ ఆలోచన చేసిన సమైక్య పోలీసులు ఆనాడు అతనిపై కుట్ర కేసు బనాయించి నల్లగొండ. జైల్లో నిర్బంధించడం జరిగింది అదే రోజు నకరికల్ ప్రస్తుత శాసనసభ్యులు వేముల వీరేశం డాక్టర్ చెరుకు సుధాకర్ తో కలిసి. నల్లగొండ జిల్లా జైల్లో 28 రోజులు తెలంగాణ రాష్ట్రం కోసం జైలు జీవితాన్ని గడపవలసి వచ్చింది.హైదరాబాదులో సకలజనుల సమ్మె ఉండగా ఒకరోజు ముందే క్రిస్టఫర్.ను. బైండోవర్. చేయడం జరిగింది వలిగొండ పోలీస్ స్టేషన్లో. అయినా బైండోవర్లు నన్ను ఏమి చేయలేవని ఒక రోజు ముందే బస్సులో హైదరాబాద్కు చేరుకొని అశోక్ నగర్ చౌరస్తా దగ్గర భారీ కేట్లు తొలగిస్తున్న సమయంలో అకస్మాత్తుగా స్పెషల్ పోలీస్ మీద పడి విపరీతంగా కొడుతున్న. సమయంలో అతను చెయ్యి విరగడం జరిగింది అయినా మొక్కవోని ధైర్యంతో వలిగొండకు వచ్చి భూపాల్ రెడ్డి డాక్టర్ దగ్గర వచ్చి. చెయ్యికి వైద్యం చేయించుకోవడం జరిగింది. మరుసటి రోజు అన్ని దినపత్రికలలో నమస్తే తెలంగాణ దినపత్రికల్లో అప్పటి ఎమ్మెల్యే హరీష్ రావుతో సహా కోదండరామతో కలసి క్రిష్టపరును పోలీసులు కొట్టిన ఫోటో వైరల్ అయింది ఆ ఫోటో నేటికీ చెరపని జ్ఞాపకం గా మిగిలిపోయింది ఒకానొక దశలో జైలులో క్రిస్టఫర్ బాధపడుతుంటే. ప్రస్తుత నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్న క్రిస్టఫర్ ను దగ్గర తీసుకొని. అన్నా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జైలు జీవితం గడుపుతున్నాము అంటే అదొక చరిత్ర మనకు దొరికింది సంతోషించాలి అవసరమైతే తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అయినా ఇద్దామని కిష్టపరుకు ఆనాడు జైల్లో ప్రస్తుతం ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పిన మాటలు. ఆనాడు జైలులో ఉన్నప్పుడు కీర్తిశేషులు టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొనపూరి. రాములు క్రిస్టఫర్. ను చూడడానికి రెండుసార్లు మూలాఖత్.కు. వచ్చి పలకరించి ధైర్యం చెప్పడం. జరిగింది.. తెలంగాణ రాష్ట్రం కోసం అవసరమైతే ప్రాణాలు ఇవ్వడానికి కూడా వెనకాడని క్రిష్టఫర్ చరిత్ర మరువలేనిది ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించి .ఝూర?ండ్ రాష్ట్రంలో ఉద్యమకారులను గౌరవిస్తున్నట్టుగానే మన రాష్ట్రంలో కూడా ఉద్యమకారులను గౌరవించాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు



# ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటుదాం

### TSSO రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్

మన సాక్షి గొంతుక /జూన్ 11/రంగా రెడ్డి జిల్లా బ్యూరో

ఫరూక్ నగర్ మండల పరిధిలోని ప్రతం ఎడ్యుకేషనల్ కళాశాలలో టి ఎస్ ఎస్ ఓ షాద్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ సందర్భంగా లక్ష్మీ నివాస్ మాట్లాడుతూ..... సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థులో ఉంటుందని అన్నారు. ప్రజలు, యువత సామాజిక స్పృహను అలవార్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రజలంతా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, కాలుష్యం మానవ జీవన ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు. కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతి ఇంటి ఆవరణలో, వ్యవసాయ పొలాలలో మొక్కలు నాటాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీఎస్ ఎస్ ఓ రాష్ట్ర నాయకులు సుదర్శన్.టీఎస్ ఎస్ ఓ నాయకులు రాహుల్ శ్రీనివాస్ అఖిలేష్ వినయ్ వంశీ అఖిలేష్ విజయ్ రమేష్ సతీష్ నితీష్ సుజిత్ హర్షవర్ధన్ రిషికేష్ సాయి నరేష్ అజయ్ కుమార్ నాగరాజ్ రవితేజ నరసింహ మహేందర్ సింహాద్రి పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్(టెస్కాబ్)చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన వరంగల్ జిల్లా డిసిసిబి బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జనగామ పిఏసిఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి.



మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి





మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

జనగామ మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పోలీస్ శాఖ అధికారులకు సూచించారు.మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలపై ఏసిపి అంకిత్ కుమార్ తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్,మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులతో మున్సిపల్ పరిధిలోని పలు సెంటర్లను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న జనాభా కనుగుణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను సమస్యలను పరిష్కరించేందుకు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించవలసిన అవసరం ఉందన్నారు.తద్వారా ప్రమాదాలను అరికట్టగలుగుతామని సమయ పాలన సులువు అవుతుందన్నారు.అందుకు తగినట్లుగా ట్రాఫిక్ నిబంధనలను తెలిపే విధంగా రోడ్లు భవనాల శాఖ అధికారులు సూచికలు ఏర్పాటు చేయాలని,మున్సిపల్ అధికారులు కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి ఈఈ హుస్సేన్,మున్సిపల్,పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జోరు సాగనీ

## నేడు భారత్, అమెరికా పోరు
## దూకుడు మీదున్న ఇరు జట్లు
## సూపర్-8 లక్ష్యంగా బరిలోకి

**న్యూయార్క్:** భారత్, అమెరికా మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. బుధవారం నసావు స్టేడియం వేదికగా ఇరు జట్లు ముఖాముఖి తలపడనున్నాయి. టైటిల్ హాట్ ఫేవరేట్లలో ఒకటైన టీమ్ఇండియా..ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకుంటున్న అమెరికాపై తమ ప్రతాపం చూపించాలన్న పట్టుదలతో ఉంది. పాకిస్థాన్‌పై ఉత్కంఠ విజయమిచ్చిన ఉత్సాహంతో ఉన్న రోహిత్‌సేన..యూఎస్ఏపై గెలిచి సూపర్-8 బెర్తు దక్కించుకునేందుకు పక్కా ప్రణాళికతో ఉన్నది. పేరుకు అమెరికా అయినా జట్టంతా ప్రవాస భారతీయులతో కనిపిస్తున్నది. జట్టులో అగ్రభాగం మనోళ్లదే కావడం విశేషం. అసలు అమెరికా జట్టేనా లేక ద్వితీయశ్రేణి భారత టీమ్ అన్న సందేహం కలుగక మానదు. ఇదిలా ఉంటే ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండింటి గెలిచిన టీమ్ఇండియా టాప్ గేర్‌లో దూసుకెళుతుంటే..అమెరికా తామేం తక్కువ కాదన్నట్లు జోరు కనబరుస్తున్నది. పరీక్ష పెడుతున్న నసావు పిచ్‌పై ఒక అంచనాకు రాలేకపోతున్న రోహిత్‌సేన..అమెరికా జట్టును ఎలా డీల్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. లోస్కోరింగ్ థ్రిల్లర్‌లు నమోదు అవుతున్న మెగాటోర్నీలో భారత్‌కు అమెరికా పోటీనిస్తుందో చూడాలి.

సూపర్-8 లక్ష్యంగా:
మెగాటోర్నీలో భారత్ సూపర్-8 లక్ష్యంగా అడుగులు వేస్తున్నది. గత 11 ఏండ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం చకోరా పక్షిలా ఎదురుచూస్తున్న టీమ్ఇండియా మరీ ఈసారైనా తమ కలను సాకారం చేసుకుంటుందా అన్నది అభిమానుల మెదళ్లను తొలుస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రతీ మ్యాచ్ కీలకం కాబోతున్నది. రెండింట విజయాలతో మెరుగైన స్థితిలో ఉన్న టీమ్ఇండియా అదే గెలుపు జోరు కొనసాగిస్తూ అమెరికా పనిపట్టాలని చూస్తున్నది. అయితే పాకిస్థాన్‌పై మన వాళ్ల బ్యాటింగ్ ప్రదర్శన తర్వాత ఒకింత ఆందోళన కల్గిస్తున్నది. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై పరుగులు ఎలా రాబట్టాలో తెలియక టీమ్ఇండియా స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. అమెరికాపై మళ్లీ అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండేందుకు రోహిత్‌సేన జాగ్రత్త పడే అవకాశముంది. యూఎస్ఏతో మ్యాచ్ కోసం పెద్దగా మార్పులు లేకుండానే బరిలోకి దిగే చాన్స్ ఉంది. ముఖ్యంగా వరుసగా విఫలమవుతున్న శివమ్ దూబే స్థానంపై సందిగ్ధత కొనసాగుతున్నది.




# శివం దూబేపై వేటు

- జైశ్వాల్ కు చాన్స్
- రేసులో సంజూ శాంసన్
- రేపే అమెరికాతో టీమ్ ఇండియా ఢీ



టీ20 ప్రపంచకప్ 2024లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గ్రూప్‌ఏలో భాగంగా బుధవారం న్యూయార్క్‌లోని నాసా కౌంటీ స్టేడియం వేదికగా ఆతిథ్య అమెరికా తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఐర్లాండ్, పాకిస్థాన్‌పై విజయం సాధించిన టీమిండియా రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతుండగా.. యూఎస్ఏ కూడా పాకిస్తాన్, కెనడాను ఓడించి మరో సంచలన విజయాన్ని నమోదు చేయాలనే పట్టుదలతో ఉంది.

**శివమ్ దూబేపై వేటు..**
ఈ మ్యాచ్ గెలిచిన జట్టు గ్రూప్ఏ నుంచి అధికారికంగా సూపర్ 8కు అర్హత సాధించనుంది. వర్షం కారణంగా రద్దయితే మాత్రం పాకిస్థాన్ సూపర్ 8 చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించనుంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఒకే కాంబినేషన్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. అమెరికాతో పోరులో తుది జట్టులో ఒక మార్పు చేసే అవకాశం ఉంది. స్పెషలిస్ట్ బ్యాటర్‌గా సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్‌లో ఒకరికి అవకాశం ఇవ్వనుంది. దాని కోసం పాకిస్థాన్‌తో దారుణంగా విఫలమైన శివమ్ దూబేపై వేటు వేయనుంది.

**జైస్వాల్‌కు చోటు..**
అతను రెండు మ్యాచ్‌ల్లో అటు బ్యాట్, ఇటు బంతితో రాణించిందేం లేదు. శివమ్ దూబేతో రోహిత్ ఒక్క ఓవర్ కూడా వేయించలేదు. ఈ క్రమంలోనే అతన్ని పక్కనపెట్టి స్పెషలిస్ట్ బ్యాటర్లు అయిన యశస్వి జైస్వాల్, సంజూ శాంసన్‌ల్లో ఒకరిని తుది జట్టులోకి తీసుకోవాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. యశస్వి జైస్వాల్ ఆడేందుకే ఎక్కువ అవకాశం ఉంది. ఓపెనర్‌గా విరాట్ కోహ్లీ 1, 4 దారుణంగా విఫలమవడంతో అతన్ని ఫస్ట్ డౌన్‌లో ఆడించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ క్రమంలోనే యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్‌గా ఆడించిన విరాట్ కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్ చేయించాలనుకుంటోంది. పవర్ ప్లేలో దూకుడుగా ఆడే సామర్థ్యం యశస్వి జైస్వాల్‌కు ఉంది. పేస్ త్రయం జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్ అదరగొడుతుండగా..ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌లు దుమ్మురేపుతున్నారు. కానీ మరో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఇప్పటి వరకు వికెట్ల ఖాతా తెరవలేదు. అయితే అతని స్థానానికి ఇప్పుడే వచ్చిన ముప్పు ఏం లేదు. స్పెషలిస్ట్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్‌లకు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

**భారత తుది జట్టు(అంచనా)**

**రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, సూర్య కుమార్ యాదవ్, రిషభ్ పంత్(కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్**

# గెలిచి నిలిచిన పాక్



## కెనడాపై గెలుపు
## సూపర్-8 ఆశలు సజీవం

**న్యూయార్క్:** టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈ టోర్నీలో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆ జట్టు సమిష్టిగా రాణించి కెనడాపై 7 వికెట్ల తేడాతో గెలిచింది. మంగళవారం న్యూయార్క్‌లోని నసావు స్టేడియం వేదికగా కెనడాతో జరిగిన మ్యాచ్‌లో కెనడాను ఓడించి సూపర్-8 ఆశలను సజీవంగా ఉంచుకుంది. మహ్మద్ అమిర్ (2/13), హరీస్ రవూఫ్ (2/26) ధాటికి తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా.. 20 ఓవర్లలో 106/7 కే పరిమితమైంది. ఆరోన్ జాన్సన్ (44 బంతుల్లో 52, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) మినహా అందరూ విఫలమయ్యారు. స్వల్ప ఛేదనలో పాక్.. 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మహ్మద్ రిజ్వాన్ (53 బంతుల్లో 53 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. అమిర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆరోన్ ఒక్కడే..
పటిష్టమైన పాకిస్థాన్ పేస్ బలానికి పసికూన కెనడా విలవిల్లాడింది. ఆ జట్టులో ఓపెనర్ ఆరోన్ ఒక్కడే రాణించాడు. ఎదుర్కున్న తొలి రెండు బంతులనే బౌండరీలుగా మలిచిన అతడు సహచర ఆటగాళ్లు వచ్చినోళ్లు వచ్చినట్టే క్రీజును వదులుతున్నా ఒంటరిగా పోరాడాడు. ఆరోన్ మినహా కెప్టెన్ సద్ బిన్ జఫర్ (10), కలీమ్ సనా (13) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.

**పాక్ కష్టంగానే..**
స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ కూడా ధాటిగా ఆడలేకపోయింది. సారథి బాబర్ ఆజమ్ (33 బంతుల్లో 33) ఓపెనర్ స్థానాన్ని యువ ఆటగాడు సయీమ్ అయూబ్ (6) కు త్యాగం చేసినా అతడు విఫలమయ్యాడు. వన్ డౌన్‌లో వచ్చిన బాబర్‌తో కలిసి రిజ్వాన్ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించి పాక్ విజయాన్ని ఖాయం చేశాడు. బాబర్ నిష్క్రమించినా రిజ్వాన్ చివరిదాకా క్రీజులో నిలిచి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**సంక్షిప్త స్కోర్లు:**
కెనడా: 20 ఓవర్లలో 106/7 (ఆరోన్ 52, సనా 13, అమిర్ 2/13, రవూఫ్ 2/26).
పాకిస్థాన్: 17.3 ఓవర్లలో 107/3 (రిజ్వాన్ 53 నాటౌట్, బాబర్ 33, డిల్లాన్ 2/18, గోర్డన్ 1/17)

# నేపాల్‌కు గుడ్‌న్యూస్

- సందీప్ లమిచానే వచ్చేశాడు
- అమెరికా వద్దన్నా... వెలకమ్ అన్న విండీస్



టీ20 ప్రపంచకప్2024లో నేపాల్ జట్టు ఆడే చివరి రెండు మ్యాచ్‌లకు ఆ జట్టు స్టార్ క్రికెటర్ సందీప్ లమిచానే అందుబాటులోకి రానున్నాడు. గతంలో అత్యాచార ఆరోపణలు ఎదుర్కొని ఎనిమిదేళ్ల జైలు శిక్షకు గురై ఆ తర్వాత ఆధారాలు లేకపోవడంతో ఈ కేసు నుంచి విముక్తి పొందిన లమిచానేకు అమెరికా ప్రభుత్వం వీసా నిరాకరించింది. దాంతో అతను అమెరికా వేదికగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. నేపాల్ తమ చివరి రెండు మ్యాచ్‌లను వెస్టిండీస్ వేదికగా ఆడనుంది. ఈనెల 15న దక్షిణాఫ్రికాతో, 17న బంగ్లాదేశ్‌తో కింగ్స్‌టౌన్‌లో తలపడనుంది. ఈ నేపథ్యంలో సందీప్ లమిచానే ఇప్పటికే వెస్టిండీస్‌కు చేరుకున్నాడు. కాగా 2018లో అంతర్జాతీయ క్రికెట్ లో అడుగుపెట్టిన సందీప్ లమిచానే కెప్టెన్ స్థాయికి ఎదిగాడు. టీ20 ఫార్మాట్లో అద్భుతంగా రాణించిన ఈ లెగ్ స్పిన్ బౌలర్.. నేపాల్ తరఫున ఇప్పటి వరకు మొత్తంగా 52 టీ20లు ఆడి 98 వికెట్లు పడగొట్టాడు. అదే విధంగా 51 వన్డేలు ఆడి 112 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇదిలా ఉంటే.. టీ20 వరల్డ్‌కప్2024లో గ్రూప్ డిలో ఉన్న నేపాల్ నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడింది. ఇందులో ఆరు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. తదుపరి 12న శ్రీలంకతో ఫ్లోరిడా వేదికగా తలపడనుంది. ఈ మ్యాచ్‌కు కూడా సందీప్ దూరంగా ఉండనున్నాడు.




# కివీస్.. ట్రబుల్

- సూపర్ ఎయిట్‌లోకి అనుమానమే?
- తప్పని గండం
- ఉగాండాతో ఓటమి.. న్యూజిలాండ్‌కూ సమస్యలు
- ఆసక్తిగా సాగుతున్న టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లు
- సత్తా చాటుతున్న చిన్న జట్లు

టీ20 వరల్డ్ కప్2024 ఆసక్తికరంగా సాగుతోంది. సిక్సర్ల సునామీ రాకపోయినా హోరాహోరీ మ్యాచ్‌లతో క్రికెట్ అభిమానులను అలరిస్తోంది. బలమైన జట్లకు కొన్ని పసికూన టీమ్స్ షాక్‌లు ఇస్తున్నాయి. మరికొన్ని మాత్రం పేలవమైన ప్రదర్శన చేస్తున్నాయి. ఆదివారం వెస్టిండీస్ చేతిలో ఉగాండ ఘోర పరాజయాన్ని చవిచూసింది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత స్వల్ప స్కోరు చేసిన జట్టుగా నెదర్లాండ్స్ సరసన నిలిచింది. అయితే వెస్టిండీస్ చేతిలో ఉగాండ చిత్తుగా ఓడి న్యూజిలాండ్ కొంప ముంచింది. టీ20 వరల్డ్ కప్ నుంచి కివీస్ జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించే పరిస్థితికి తీసుకువచ్చింది. 134 పరుగుల భారీ తేడాతో ఉగాండ ఓటమి పాలవ్వడంతో వెస్టిండీస్‌కు నెట్ రన్‌రేట్ గణనీయంగా పెరిగింది. +3.574కు చేరుకుంది. గ్రూప్ సీలో రెండు మ్యాచ్‌లు ఆడిన విండీస్ నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మరోవైపు అఫ్గానిస్థాన్ ఆడిన రెండింట్లో గెలిచి నాలుగు పాయింట్లు, +5.225 నెట్ రన్‌రేటుతో అగ్రస్థానంలో నిలిచింది. అఫ్గానిస్థాన్, వెస్టిండీస్ భారీ నెట్ రన్‌రేట్ సాధించడంతో న్యూజిలాండ్ సూపర్ 8కు అర్హత సాధించే అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. గ్రూప్‌సీలో ప్రస్తుతం న్యూజిలాండ్ అట్టడుగున నిలిచింది. కివీస్ ఒక్క మ్యాచే ఆడినప్పటికీ ఆ జట్టు (4.200) నెగటివ్ నెట్ రన్‌రేటుతో ఉంది. వెస్టిండీస్‌ఉగాండ మ్యాచ్ ముందువరకు న్యూజిలాండ్ తదుపరి దశపై ఆశలతోనే ఉంది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో గెలిస్తే సూపర్ 8కు క్వాలిఫై కావొచ్చని ప్రణాళికలు రచించుకుంది. కానీ వెస్టిండీస్ భారీ తేడాతో గెలవడంతో సమీకరణాలు మారిపోయాయి. వెస్టిండీస్, అఫ్గానిస్థాన్‌ను అధిగమించి న్యూజిలాండ్ సూపర్ 8కు అర్హత సాధించాలంటే నెట్ రన్ రేటు పరిగణనలోకి రాకుండా పాయింట్ల పరంగానే సాధించాలి. వెస్టిండీస్ లేదా అఫ్గానిస్థాన్‌తో సమానంగా పాయింట్లు సాధిస్తే ఇంటిముఖం పట్టాల్సిందే. ఎందుకంటే కివీస్ మైనస్ 4 రన్‌రేటుతో ఉంది. అది పాజిటివ్‌లోకి వచ్చి +2 దాటాలంటే అద్భుత విజయాలు సాధించాలి. పాయింట్ల పరంగా.. వెస్టిండీస్ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై, న్యూజిలాండ్ అన్నింట్లో విజయం సాధిస్తే నెట్ రన్‌రేటుతో సంబంధం లేకుండా విలియమ్సన్ సేన సూపర్ 8కు అర్హత సాధిస్తుంది. వెస్టిండీస్ తమ తదుపరి మ్యాచ్‌ల్లో అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్‌తో తలపడనుంది. మరోవైపు అఫ్గానిస్థాన్ కూడా తమ మిగిలిన మ్యాచ్‌ల్లో పరాజయాన్ని చవిచూస్తే కివీస్‌కు కలిసొస్తుంది. గ్రూప్ స్టేజ్‌లో పపువా న్యూ గినియా, వెస్టిండీస్‌తో అఫ్గాన్ పోటీపడాల్సి ఉంది.

## అక్మల్ కామెంట్స్‌పై
# భజ్జీ ఫైర్

**క్షమాపణలు చెప్పిన పాక్ మాజీ క్రికెటర్**

భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ స్ట్రాంగ్ కౌంటర్ తో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ దిగొచ్చాడు. ఆదివారం భారత్ వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ, సిక్కు కమ్యూనిటీని అవమానించేలా అక్మల్ కామెంట్స్ చేశాడు. వాటిపై సోషల్ మీడియా వేదికగా దుమారం చెలరేగడంతో పలువురు ప్రముఖులు స్పందించారు. ఈ కాంట్రవర్సీ విషయంలో భజ్జీ కల్పించుకుని గట్టి కౌంటర్ ఇవ్వడంతో అక్మల్ దెబ్బకు దిగొచ్చాడు. తన తప్పు తెలుసుకుని వెంటనే క్షమాపణలు కోరాడు. న్యూయార్క్ వేదికగా జూన్ 9న భారత్ పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్‌లో విజయం ఎవరికి దక్కుతుందా అని ఎదురుచూస్తున్న తరుణంలో కమ్రాన్ అక్మల్ ఏఆర్ వై న్యూస్ ఛానెల్‌లో జరిగిన ప్యానెల్ డిస్కషన్ లో పాల్గొన్నాడు. సరిగ్గా చివరి ఓవర్ ను టీమిండియా పేసర్ అర్షదీప్ సింగ్ బౌలింగ్ చేస్తున్న సమయంలో సిక్కుల కమ్యూనిటీని అవమానించేలా, తప్పుడు వ్యాఖ్యలు చేశాడు. "ఏదైనా జరగొచ్చు. టైం ఆల్రెడీ 12 అయింది. అర్ధరాత్రి 12 గంటలకు ఏ సిక్కుకూ బౌలింగ్ ఇవ్వరాదు" అంటూ కామెంట్స్ చేశాడు. ఒక మతాన్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి. అవి కాస్తా హర్భజన్ సింగ్ కు చేరడంతో మనోడు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. "నీ చెత్త నోరు తెరిచే ముందు ఒకసారి సిక్కుల చరిత్ర తెలుసుకో. అర్ధరాత్రి 12 గంటలకు ఆక్రమణదారులు మీ తల్లులు, సోదరీమణులను అపహరించినప్పుడు కాపాడిన చరిత్ర సిక్కులది. నీకు కొంచెం కూడా అభిమానం లేకపోవడం సిగ్గు చేటు" అని ట్విట్టర్ లో పోస్టు పెట్టాడు. దీంతో యావత్ సిక్కుల కమ్యూనిటీనే అవమానించేలా చేసిన కామెంట్లపై అక్మల్ రియలైజ్ అయ్యాడు. "నేను హర్భజన్ సింగ్, సిక్కుల కమ్యూనిటీలపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతున్నాను. నా మాటలు అవమానించేలా, తప్పుగా ఉన్నాయని తెలుసుకున్నాను. నాకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కులపై చాలా గౌరవముంది. ఎవరినీ బాధపెట్టాలనే ఉద్దేశ్యంతో అలా అనలేదు. అందరినీ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను" అంటూ రిప్లై ఇచ్చాడు.

# 75వ సినిమా మొదలైంది

రవితేజ 75వ సినిమా షూటింగ్ మంగళవారం పూజాకార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. శ్రీలీల ఇందులో కథానాయిక. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ప్రొడక్షన్ నంబర్ 28'గా మొదలైన ఈ చిత్రం ద్వారా యువరచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ముహూర్తపు సన్నివేశానికి శ్రీలీల క్లాప్ కొట్టగా, భాను భోగవరపు దర్శకత్వం వహించారు.

ఇందులో రవితేజ హాస్యంతో కూడిన మాస్ పాత్రలో కనిపించనున్నారని, వినోదంతో కూడిన పూర్తి మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నదని చిత్రం బృందం వెల్లడించింది. బ్లాక్‌బాస్టర్ 'వాల్తేరు వీరయ్య'కు మాటలు రాసిన తాను, మరో బ్లాక్‌బాస్టర్ 'సామజవరగమన'కు కథ, స్క్రీన్‌ప్లే రచయితగా పనిచేశానని, ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'ఎన్బీకే 109'కు మాటలు రాస్తున్నానని, ఇంత తక్కువ సమయంలో రవితేజ సినిమాను డైరెక్ట్ చేసే ఛాన్స్ రావడం అదృష్టంగా ఫీలవుతున్నానని దర్శకుడు భాను భోగవరపు అన్నారు. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, మాటలు: నందు సవిరిగాన, సంగీతం: భీమ్స్





## వాష్ రూమ్‌నూ.. వదలడం లేదు

కన్నడ ముద్దుగుమ్మ చైత్ర జె ఆచార్ సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంది. తాజాగా మరోసారి చైత్ర షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈసారి బాత్ రూంలో కెమెరాకు ఫోజ్ లు ఇచ్చింది. బాత్ షూట్ లో చైత్ర ఆచార్ క్లీ వేజ్ షో చేస్తూ, థైస్ అందాలను చూపిస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేస్తుంది కనుకే ముద్దుగుమ్మ చైత్ర చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## బాలీవుడ్‌లోకి.. కృతిశెట్టి

సాధారణంగా హీరోయిన్స్ ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి చాలా సమయం పడుతుంది. కానీ అతి కొద్ది మంది మాత్రమే ఒక్క సినిమాతోనే లేదంటే ఒక్కటి కూడా విడుదల అవ్వకుండానే బిజీ అవ్వడం మనం చూస్తూ ఉంటాం. ఆ మధ్య ఉప్పెన హీరోయిన్ కృతి శెట్టి మొదటి సినిమా విడుదల అవ్వకుండానే రెండు మూడు సినిమాల్లో ఎంపిక అయ్యింది. ఇప్పుడు అదే మాదిరిగా మిస్టర్ బచ్చన్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్స్ కూడా తన మొదటి తెలుగు సినిమా విడుదల అవ్వకుండానే రెండు ఆఫర్లు దక్కించుకుంది. ఇప్పటికే విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న సినిమాలో ఈ అమ్మడికి చోటు దక్కింది. ఆ మధ్య విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబో మూవీకి సంబంధించిన షూటింగ్ లో కూడా ఈ అమ్మడు పాల్గొంది. తాజాగా దుల్కర్ సల్మాన్ హీరోగా నటించబోతున్న తెలుగు సినిమాలో ఈ అమ్మడికి ఛాన్స్ దక్కిందనే వార్తలు వస్తున్నాయి. దుల్కర్ సల్మాన్ హీరోగా సుధాకర్ చెరుకూరి నిర్మించబోతున్న సినిమాతో రవి అనే నూతన దర్శకుడు పరిచయం అవ్వబోతున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ గా భాగ్య శ్రీ బోర్స్ ను ఎంపిక చేయడం జరిగిందని సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతుంది. ఈ మధ్య కాలంలో ఇంత స్పీడ్ గా బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు దక్కించుకున్న ముద్దుగుమ్మ భాగ్య శ్రీ మాత్రమే అంటూ టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. తక్కువ సమయంలో ఎంతో పాపులారిటీని సొంతం చేసుకున్న ఈ అమ్మడు ముందు ముందు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మంచి గుర్తింపు దక్కించుకోవడం ఖాయంగా సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## మ్యాగజైన్ కవర్ పేజీ కోసం.. హాట్ స్టిల్స్

శ్రేయా ధన్వంతరి.. ఈ పేరు ఆడియన్స్ కి పెద్దగా తెలియకపోవచ్చు. కానీ టాలీవుడ్ లోనే నటిగా కెరియర్ స్టార్ట్ చేసి ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో సినిమాలు, వెబ్ సిరీస్ లతో సత్తా చాటుతున్న అందాల భామ. నాగ చైతన్య జోష్ సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కెరియర్ స్టార్ట్ చేసిన శ్రేయా ధన్వంతరి సందీప్ కిషన్ స్నేహగీతం సినిమాలో ఒక హీరోయిన్ గా నటించింది. ఆ తరువాత తెలుగులో చెప్పుకోదగ్గ అవకాశాలు రాలేదు. దీంతో ముంబై వెళ్ళిపోయిన ఈ బ్యూటీ అక్కడ మోడలింగ్ లో అడుగుపెట్టి సక్సెస్ అయ్యింది. తరువాత వై చీట్ ఇండియా అనే మూవీలో ఇమ్రాన్ హష్మీకి జోడీగా శ్రేయా ధన్వంతరి నటించింది. తరువాత లూప్ లుపేట, చుప్, అన్ పాసెడ్ సినిమాలలో నటించింది. ప్రస్తుతం ఆమె చేసిన రెండు సినిమాలు రిలీజ్ కి సిద్ధం అవుతున్నాయి. మరో వైపు డిజిటల్ ఎంట్రీ ఇచ్చి ది ఫ్యామిలీ మెన్ వెబ్ సిరీస్ లో నటించింది. గత ఏడాది వచ్చిన దుల్కర్ లీడ్ రోల్ లో వచ్చిన గన్స్ అండ్ గులాబ్స్ వెబ్ సిరీస్ లో కూడా శ్రేయా ధన్వంతరి నటించింది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీకి సినిమాలు, వెబ్ సిరీస్ ల ద్వారా నటిగా గుర్తింపు వస్తే సోషల్ మీడియాలో మాత్రం మరో ఫేమ్ సంపాదించింది. ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా హాట్ హాట్ ఫోటోషూట్ లని శ్రేయా ధన్వంతరి షేర్ చేస్తూ ఉంటుంది. అందాల ప్రదర్శనలో పెద్దగా హద్దులు లేకుండా చేసే ఆమె గ్లామర్ షోకి విపరీతంగా ఫ్యాన్స్ ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు విమెన్ ఫిట్ నెస్ ఇండియా మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ప్రత్యేకంగా ఫోజులిచ్చింది. వైట్ కలర్ లాంగ్ ఫ్రాక్ ధరించి పెర్ఫెక్ట్ షేప్స్ తో హాట్ స్టిల్ లో శ్రేయా ధన్వంతరి మాయ చేస్తోంది. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



## దేవయాని బిజీ బిజీ..

సోషల్ మీడియాలో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. కొందరు సినిమాలతో కంటే కూడా ఎక్కువగా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా గుర్తింపు పొందిన వారు ఉన్నారు అనడంలో సందేహం లేదు. పెద్దగా సినిమాలు చేయకున్నా ఒకటి రెండు వెబ్ సిరీస్ లు, చిన్న సినిమాల్లో నటించిన ముద్దుగుమ్మ దేవియాని శర్మ. ఈ అమ్మడు తెలుగు లో మాత్రమే కాకుండా ఇతర భాషల వారికి కూడా సోషల్ మీడియా అందాల ఫోటో షూట్స్ కారణంగా దగ్గర అవుతుంది. సేవ్ ది టైగర్స్ లో కీలక పాత్రలో నటించిన దేవియాని శర్మ ప్రస్తుతం ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలతో నెట్టింట సందడి చేస్తుంది. ఈ స్థాయి అందాల ఆరబోత కారణంగా ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పెద్దగా స్కిన్ షో చేయకుండానే కవ్వించే చూపులతో ఎదుటి వారిని పడగొట్టేంత అందం ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. ఈ ఫోటోల్లో ఆమె చూపులకు ఎంతటి వారు అయిన కింద పడి పోవాల్సిందే అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## కల్కీ ట్రైలర్ అదుర్స్

kalki 2898 ad

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ " కల్కి 2898 AD "..మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ ఈ సినిమాను బిగ్గెస్ట్ పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కిస్తున్నారు.ఈ సినిమాను వైజయంతి మూవీస్ బ్యానర్ పై నిర్మాత అశ్వినీదత్ భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు.ఈ సినిమా లో అమితాబ్ ,కమల్ వంటి లెజెండరీ స్టార్స్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.అలాగే ఈ సినిమాలో ప్రభాస్ సరసన దీపికా పదుకోన్ ,దిశా పటాని హీరోయిన్స్ గా నటిస్తున్నారు.ఈ సినిమాను మేకర్స్ జూన్ 27 న ఎంతో గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేసారు.రిలీజ్ అయిన ట్రైలర్ ప్రేక్షకులను మరో కొత్త లోకంలోకి తీసుకెళ్లింది.విజువల్ వండర్ గా కల్కి ట్రైలర్ వుంది.కళ్ళు చెదిరిపోయేలా వున్నా ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేసింది.ఈ సినిమా ట్రైలర్ మూవీపై భారీగా అంచనాలు పెంచేసింది.ఈ ట్రైలర్ లో ప్రభాస్ యాక్షన్ స్టంట్స్ ఫ్యాన్స్ కు గూస్ బంప్స్ తెప్పించింది.అలాగే సినిమాలో అమితాబ్ క్యారెక్టర్ అదిరిపోనున్నట్లు తెలుస్తుంది. కల్కి ట్రైలర్ యూట్యూబ్ లో రికార్డు వ్యూస్ తో దూసుకుపోతుంది.అన్ని భాషల్లో కలిపి ఈ ట్రైలర్ కు 16 మిలియన్ వ్యూస్ వచ్చినట్లు తెలుస్తుంది.ఇదిలా ఉంటే ఈ సినిమా రిలీజ్ అయిన కొన్ని రోజుల ముందు మేకర్స్ ఈ సినిమా నుండి మరో ట్రైలర్ ను రిలీజ్ చేయనున్నట్లు సమాచారం.త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది.

